


# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 18, 2026 | సంపుటి : 2 | సంచిక : 187 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



# 30లక్షలకు పైగా

## ధాన్యం సేకరణ చేపట్టండి

**• కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :**
2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి  సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.



# సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

**▪ విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ▪ సిఎండితో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం**

**హైదరాబాద్,ఏప్రిల్17 :**
ట్రాన్స్కో సీఎం డి తో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని  జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన

# గురుకుల బిసి విద్యార్థులకు సన్మానం

**- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్17 :**
బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



మిగతాది 2లో

### సిగాచీ బాధితులను

# నట్టేట ముంచారు

**» కోటి పరిహారం హామీ**

**ఇచ్చి మరచిన సిఎం**

**» మరోమారు మండిపడ్డ హరీష్ రావు**




2లో..

**హైదరాబాద్,ఏప్రిల్17 :**
సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు.

# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

**» మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :**
తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు.



2లో




2లో..

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :**
కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహిళా బిల్లు వైఫల్యానికి భాజపాదే బాధ్యత: కేటీఆర్



హైదరాబాద్: మహిళా బిల్లు వైఫల్యానికి భాజపాదే బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ అంశాన్ని ముడిపెట్టడంతోనే బిల్లు వీగిపోయిందన్నారు.

2లో..

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

**▪ ఉత్తరాది, దక్షిణ్యాది పేరుతో విషం చిమ్ముతున్నారు**

**▪ కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**



2లో..

**న్యూఢిలలీ,ఏప్రిల్17 :**
దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గురు

**▪ వారిని పిలిచి సన్మానించిన కమిషనర్**

**▪ ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం**

**▪ ప్రజలు అప్రమత్ంగా ఉండాలన్న సజ్జన్నార్**



**హైదరాబాద్,ఏప్రిల్17 :**
తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు.

మిగతాద్ది 2 లో

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

మొదటి పేజీ తరువాయి

కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు.దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

మొదటి పేజీ తరువాయి

ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన గురుకుల బిసి విద్యార్థులకు సన్మానం

మొదటి పేజీ తరువాయి

బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్దిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

- ఉత్తర దక్షిణ పేరుతో విభజన సరికాదు
- ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు
- మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు
- డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి
- వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు
- లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళు న్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. ఢిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్ల సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళ్తున్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం పెరగడం వల్ల బలమైన గొంతు వినిపించే అవకాశం ఉంటుందని వివరించారు.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

**మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.**

## 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గరు

మొదటి పేజీ తరువాయి

ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ – 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మహిళా బిల్లు వైఫల్యానికి భాజపాదే బాధ్యత: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు రిజర్వేషన్లకు సానుకూలంగా ఉన్నా.. భాజపా రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిందని విమర్శించారు. "మహిళలకు రిజర్వేషన్లు వచ్చేలా కొత్త బిల్లు తీసుకురావాలి. మహిళా సాధికారతపై భాజపాకి చిత్తశుద్ధి లేదని తేలిపోయింది. భాజపా రాజకీయ స్వార్థానికి మహిళలు బలయ్యారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో భాజపా ఆడిన నాటకాన్ని ప్రజలు కళ్లారా చూశారు. డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెంచాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు

**– విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు**

ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన

- పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలి
- స్కూళ్లలో ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్
- మంత్రి నారా లోకేశ్ ఆదేశాలు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను 3 స్టార్‌కు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్ అవార్డు ఇవ్వాలే...

- హమీలు అమలు చేయకుండా అన్ని చేసినమంటున్న మంథని ఎమ్మెల్యే
- ఆలోచన.అవగాహన లేదనే అబద్దాలు ఆడటంలో వెనుకడుగు వేయడం లేదు
- ఆనాడు తిరస్కరించిన కరెంటోళ్లను కీర్తించేలా చేసిన మాజీ సీఎం కేసీఆర్
- న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 17**

ప్రజలను మోసం ఎలా చేయాలో మోసం చేసి ఎలా దర్జాగా ఉండాలో చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్, పద్మశ్రీ అవార్డులు ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజులుగా మంథని డివిజన్ కార్యాలయం మరియు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సూపర్డెంట్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్టన్ కమిటి ఆధ్వర్యంలో విద్యుత్ అర్టిజన్, అన్‌మ్యాన్డ్, పీస్‌రేటు కార్మికుల నిరవధిక సమ్మె దీక్షా శిభిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మార్పు పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిందని,గత 28నెలలుగా ఇబ్బందులు పెడుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఏ విదంగా ఉంటుందో అధికారం వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో 18ఏండ్ల ఓటు హక్కు కల్గిన వ్యక్తి యాభై ఏండ్ల వరకు గుర్తుండే విధంగా పరిపాలన చేయడం అధ్బుతంగా బావించవచ్చన్నారు. దేశంలో పద్మశ్రీలు, పద్మభూషన్‌లు అవార్డులు సేవలు చేసే వారికి మాత్రమే ఇస్తారని, కానీ ఇందిరమ్మ మార్పు పేరుతో ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ అవార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ని కార్యకర్త నుంచి రాహుల్ గాంధీవరకు ఈ విధంగానే వ్యవహరిస్తున్నారని, మహిళలకు 2500లు ఇయ్యకుండా ఇచ్చినట్లు, బీసీ రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఇచ్చినమని చెప్తున్నారని అన్నారు. అన్ని చేసినమని చిత్రగుప్తుడు మానీఫెస్టో కమిటి చైర్మన్ 420హమీల రూపశిల్పి మంథని ఎమ్మెల్యే ఇటీవల జీ తెలుగు ఇంటర్వ్యూలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్దాలు ఆడటంలో ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని, ప్రజలు ఆలోచన చేయడం లేదని, అవగాహన, చైతన్యం లేదని కాంగ్రెస్ పార్టీ బావిస్తోందని అన్నారు. ఈనాటి వరకు ఎదిరిస్తలేం , నిలదీస్తలేం కనుకనే అలా చెప్పుకుంటూ పోతున్నరన్నారు. ఆనాడు పాదయాత్ర చేసిన సీఎల్పీ లీడర్ భట్ట విక్రమార్క విద్యుత్ కార్మికుల హమీ ఇచ్చి ఈనాడు విస్మరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేయడంలో అద్భుతాలు సృష్టిస్తోందని విమర్శించారు. ఈనాటికి రిటైర్డ్ మెంట్ వరకు వచ్చినా ఇంకా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నయో వాటిని పూర్తి చేయడం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సరైందన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడక ముందు కేసీఆర్ రాకముందు కరెంటు వాళ్లను ఎలా తిరస్కరించుకునే పరిస్థితి ఉందో చూశామని, కానీ పదేళ్ల కాలంలో అదే కరెంటోళ్లను కీర్తించే స్థాయికి కేసీఆర్ తీసుకువచ్చారని అన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవచ్చు కానీ గౌరవించే వరకు తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ పాలన అంటే చీకటి మోస దగా పాలన అనే రీతికి తీసుకువచ్చిండ్లని, కార్మికుల నిరవధిక సమ్మె ఇందుకు ఉదాహరణ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పదేండ్ల తర్వాత ప్రజలు కొంత వ్యతిరేకించవచ్చు కానీ ఈనాడు రెండున్నర ఏండ్లకే కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడిలకు భయపడవద్దని, బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా కల్పించారు.

# ఏళ్ల నిరీక్షణకు ముగింపు

## జమ్మికుంటలో డయాలసిస్ కేంద్రాలకు గ్రీన్ సిగ్నల్...

- పేద రోగులకు ప్రాణవాయువుగా మారనున్న చారిత్రక నిర్ణయం
- -- జమ్మికుంట -- కమలాపూర్ ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్లు
- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయానికి కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- ప్రణవ్ బాబు కృషికి ప్రశంసలు... ప్రజల కష్టాలకు ముగింపు దిశగా కీలక అడుగు
- సుదూర ప్రయాణాల బాధలకు చెక్ -- స్థానికంగానే చికిత్స అందుబాటులోకి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 17**

కరీంనగర్ జిల్లా: జమ్మికుంట పట్టణంలో ఏళ్ల తరబడి ఎదురుచూసిన డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు చివరకు ఫలించింది. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు హుజూరాబాద్, కమలాపూర్ ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద ప్రజలకు ఊరట కలిగించే కీలక అడుగుగా నిలిచింది.

ఈ చారిత్రక నిర్ణయానికి గుర్తుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,

డయాలసిస్ రోగులు ఇప్పటివరకు తీవ్ర ఇబ్బందులు పడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఖర్చులు, ప్రయాణం, సమయపాలన---అందరు కలిసి బాధితులకు భారంగా మారిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ కేంద్రాల మంజూరుతో జమ్మికుంట మాత్రమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, ఇదీ అదే దిశలో ఒక గొప్ప అడుగని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు ప్రత్యేక కృషితోనే ఈ డయాలసిస్ కేంద్రాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. ఆసుపత్రుల మౌలిక సదుపాయాల కోసం ఇప్పటికే జమ్మికుంట, హుజూరాబాద్ ఆసుపత్రులకు చెరో 15 లక్షలు కేటాయించారని తెలిపారు. భారీ స్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల పాల్గొనడం ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, జిల్లా నాయకులు గూడెపు సారంగపాణి, మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, దుబ్బ మల్లన్న, ముద్దమల్ల రవి, పొన్నగంటి మల్లయ్య, దేశిని కోటి, కౌన్సిలర్లు చందా రాజు, శ్రీపతి నరేష్, దిడ్డి రాము, ఎగిత అశోక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట స్వప్న, పిడుగు భాగ్యలక్ష్మి, ఎండి సలీం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జమ్మికుంటలో బీజేపీ భారీ వ్యూహాత్మక దూకుడు

## మోర్చాల నియామకాలతో కేడర్‌లో కొత్త జోష్...

- గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ విస్తరణకు కొలకాని రాజు మాస్టర్ ప్లాన్ అమలు
- యువత, రైతులు, మహిళలు, బలహీన వర్గాలపై ప్రత్యేక ఫోకస్
- అన్ని మోర్చాలకు కొత్త నాయకత్వం ప్రకటించి సంస్థాగత బలోపేతానికి శ్రీకారం
- కేంద్ర పథకాల అమలే ప్రధాన లక్ష్యం -- ఇంటింటికీ బీజేపీ చేరేలా కార్యాచరణ
- స్థానిక రాజకీయాల్లో బీజేపీ శక్తి పెంపుకు కీలక మలుపు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:17**

జమ్మికుంట పట్టణంలో బీజేపీ సంస్థాగతంగా మరింత బలపడే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు వివిధ మోర్చాల అధ్యక్షులను ప్రకటిస్తూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు విస్తరించాలనే లక్ష్యాన్ని స్పష్టంగా వెల్లడించారు. యువతలో రాజకీయ చైతన్యం పెంచేందుకు యువ మోర్చా అధ్యక్షుడిగా తుర్పాటి శంకర్ ను నియమించారు.రైతు సమస్యలను సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహించేలా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా ఆకుల పోచయ్య ను ఎంపిక చేశారు.మహిళల భాగస్వామ్యాన్ని పెంచి, నాయకత్వాన్ని ముందుకు తేవాలనే ఉద్దేశంతో మహిళా మోర్చా అధ్యక్షురాలిగా చుక్కల గంగాభవాని కి బాధ్యతలు అప్పగించారు. సామాజిక వర్గాల ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేస్తూ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా శ్రీవర్తి ప్రవీణ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పుల్లూరి ప్రశాంత్,ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా లోకిని రాజేష్,మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా ఎండీ నజీరుద్దీన్ లను నియమించారు. ఈ సందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల గడపదాకా తీసుకెళ్లడం ప్రతి మోర్చా నాయకుడి బాధ్యత అని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి వర్గాన్ని కలుపుకొని ముందుకు సాగితేనే బీజేపీ మరింత బలపడుతుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కేడర్‌ను చైతన్యపరచి, ప్రతి ఓటరును పార్టీకి దగ్గర చేయాలనే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. కొత్తగా నియమితులైన నాయకులు తమ తమ విభాగాల్లో చురుకుగా పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.రాజకీయ ప్రాధాన్యత ఈ నియామకాలతో జమ్మికుంటలో బీజేపీకి సంస్థాగత బలం పెరిగి, స్థానిక రాజకీయాల్లో ప్రభావం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత, రైతులు, మహిళలు, బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకొని పార్టీ దూకుడు పెంచినట్లు స్పష్టమవుతోంది.

సారాంశంగా...జమ్మికుంటలో బీజేపీ మోర్చా నియామకాలతో పార్టీకి కొత్త శక్తి, కొత్త దిశ లభించగా---గ్రామ స్థాయి నుంచి బలపడే వ్యూహానికి ఇది కీలక మలుపుగా మారింది.

# మహిళల శక్తి లేకుండా మీడియా అసంపూర్తి -- పాత్రికేయ రంగంలో సమాన అవకాశాలు కల్పించాలి: మామిడి సోమయ్య గట్టి హెచ్చరిక

- చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రోత్సాహం లేకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు
- విలువలు కోల్పోతున్న పాత్రికేయ రంగంపై ఆందోళన
- మహిళల ప్రాధాన్యత పెంపే మీడియా భవిష్యత్తుకు బలమైన పునాది



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 17:**

మీడియా రంగం సమాజానికి అద్దం పట్టే ప్రధాన వేదికగా ఉండగా, అందులో మహిళల పాత్రను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించకుండా మీడియా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు.ప్రస్తుతం పెద్ద మీడియా సంస్థల ఆధిపత్యం పెరిగిపోతుండటంతో, చిన్న మరియు మధ్య తరహా పత్రికలు నిలబడటం కష్టమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పత్రికలే గ్రామీణ సమస్యలను, ప్రజల అసలు గొంతును వెలుగులోకి తెస్తాయని గుర్తుచేశారు.పాత్రికేయ వృత్తిలో నైతిక విలువలు క్రమంగా క్షీణిస్తున్నాయని, నిజాయితీ, నిష్పాక్షికతకు ప్రాధాన్యం తగ్గుతోందని విమర్శించారు. మీడియా కేవలం వ్యాపారంగా మారకుండా, ప్రజల కోసం పనిచేసే బాధ్యతాయుత వేదికగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలు మీడియా రంగంలో ముందుకు వస్తే సమాజంలో మార్పు వేగంగా జరుగుతుందని, వారి దృక్పథం సామాజిక సమస్యలను లోతుగా అర్థం చేసుకునేలా చేస్తుందని పేర్కొన్నారు.

మహిళా జర్నలిస్టులకు భద్రత, గౌరవం, సమాన అవకాశాలు కల్పించడం అత్యవసరమని, అప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు.

# రైతుల డిమాండ్ల సాధనకు రెండు లక్షల మందితో సమరభేరి

**– రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**

రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇచ్చిన హామీల మేరకు

అన్న దాతల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ లో ఈనెల 28 న రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి రైతుల మహా గర్జన సమరభేరి సభను పార్టీల కతీతంగా రైతు ప్రజాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. శుక్రవారం హుజురాబాద్ లో హుజురాబాద్. హుస్నాబాద్ డివిజన్ రైస్ మిల్లర్స్, సీడ్ కంపెనీల అసోసియేషన్ నాయకుల, జిల్లా ఆర్య వైశ్య సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకుల తో కలిసి ఈనెల 28న నిర్వహించే రైతు మహా గర్జన సమర భేరి సభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రైతు మహాగర్జన సమరభేరి సభ గోడ ప్రతులను నాయకులు ఆవిష్కరించారు. పోలాడి రామారావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్య వైఖరి విడనాడి వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు.

రెండు లక్షల ఋణ మాఫీ లో 30 శాతం మందికే చేసిన ప్రభుత్వం అర్హులైన మిగతా 70 శాతం రైతులకు రుణమాఫీ ఎందుకు పూర్తి చేయడం లేదని రామారావు ప్రశ్నించారు. అన్ని పంటలకు 500 రూ బోనస్ ఇస్తామని ఎందుకు కొంతమేరకు సన్న రకాలకు ఇస్తున్నారు ?ఫీజు రీయింబర్స్ మెంట్ ఎందుకు నిలిచి పోయింది? జాబ్ క్యాలెండర్ ఎక్కడ ?అని పోలాడి ప్రశ్నించారు. ఇప్పటికే రెండు సార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిన సర్కార్ పంటల సాగు సమయంలోనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నామ మాత్రంగానే ఓసి కార్పొరేషన్లను ప్రకటించిన ప్రభుత్వం వాటికి పాలక మండలి ఏర్పాటు చేయకుండా చట్ట బద్ధత కల్పించక నిదులు ఎందుకు కేటాయించ లేదు.?

గతంలో ఉన్న పాల ఉత్పత్తి దారులకు లీటరుకు రూ 4రూపాయల రాయితీ ఎందుకు నిలిపి వేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. రైతులను నిలువు దోపిడి చేస్తున్న ప్రైవేట్ సీడ్ కంపెనీల యాజమానుల ఆగడాలను ఎందుకు అరి కట్టడం లేదు. ఇచ్చిన హామీల మేరకు జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని యువతకు ఉద్యోగావకాశాలు ఎప్పుడు కల్పిస్తారు అని రామారావు ప్రశ్నించారు .50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ ఆరు వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని. రైతుల భీమా వయోపరిమితిని 59 ఏళ్ల నుంచి 70 ఏళ్లకు పెంచాలనే తదితర డిమాండ్లతో

ఈ నెల 28 న కరీంనగర్ లో రైతు ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి రైతుల మహా గర్జన సమర భేరి సభను పార్టీల కతీతంగా చారిత్రాత్మకంగా నిర్వహిస్తామని పెద్ద ఎత్తున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కదలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు ప్రజాసంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి కొండాల్ రెడ్డి ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య సంఘాల నాయకుడు తాటిపల్లి రాజన్న హుజురాబాద్ డివిజన్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కల్లెపు మోహన్ రావు, సీడ్ కంపెనీల అధ్యక్షుడు ఐరేని భాస్కర్ రెడ్డి.నాయకులు పుల్లూరి ప్రభాకర్ రావు, పలకల ఈశ్వర్ రెడ్డి, గర్రెపల్లి రాజ మొగిలి, హరి శంకర్, జైపాల్ రెడ్డి, వేల్పుల రత్నం, రాజేశ్వర్ రావు, సంపత్ రావు, తదితర రైతు ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# బోట్లు తయారీ కంపెనీని తరిమేస్తారా

దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు.దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వస్తాయంటే ఉసూరుమంటూ ఏడుస్తారని వ్యంగ్యంగా అన్నారు. రప్పా.. రప్పా నరుకుతాం.. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేస్తాం.. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్‌రెడ్డి? అంటూ వైసీపీ అధినేతను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా సూటిగా నిలదీశారు.

# మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థులకు ఆరవ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచితంగా విద్య అందించే గొప్ప అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని హుజురాబాద్ జామే మస్జీద్ ఈద్గా కబ్రిస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు.
శుక్రవారం నమాజ్ అనంతరం జామే మస్జీద్ ఆవరణంలో నిర్వహించిన మైనార్టీ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బాలురు, బాలికలు చదువుతున్నారని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ. 1,30,000 ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు.
ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు వంటి ఉన్నత స్థాయిలకు ఎదుగుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు వసతి, రుచికరమైన భోజనం, దుస్తులు వంటి అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఆయన వివరించారు. ముఖ్యంగా బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలు చదువుకుని స్థిరపడిన తరువాత తమ తల్లిదండ్రులను ఆదుకునే స్థితికి చేరుకుంటారని, కాబట్టి వెంటనే తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జామే మస్జీద్ ఇమామ్ మొహమ్మద్ షాకీర్, నాయబ్ ఇమామ్ మొహమ్మద్ అబ్దుల్ ఫహీమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను ప్రారంభించారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ రాజు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పాదచారులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సంపత్ కుమార్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
కరీంనగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా గెలుపొందిన గడ్డం లక్ష్మణ్ మొదటిసారి వేములవాడ కోర్టుకు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పిట్టల మనోహర్ బార్ అసోసియేషన్ హాల్ కు పిలిచి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. గడ్డం లక్ష్మణ్ తో పాటు, ప్రధాన కార్యదర్శి, క్రీడల కార్యదర్శి, లైబ్రరీ కార్యదర్శి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, కోశాధికారి జెట్టి శేఖర్, ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, పొత్తూరు అనిల్ కుమార్, గుడిసె సదానందం, కమటం అంజయ్య, విద్యాసాగర్ రావు,పర్ల పెల్లి అంజయ్య, కటకం జనార్ధన్,కాతు బండ నర్సింగరావు, వొద్యారం వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి రద్దీకి అనుగుణంగా రైళ్లు

వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని అనంతపురం మీదుగా యశ్వంతపూర్–జల్పైగురి మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్–న్యూ జల్పైగురి ప్రత్యేక రైలు (నం. 06567) ఈనెల 17, 24 తేదీల్లో (శుక్రవారాల్లో) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి మూడోరోజు సోమవారం ఉదయం 7 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.06568) ఈనెల 20, 27 తేదీల్లో (సోమవారాల్లో) న్యూ జల్పైగురి స్టేషన్‌లో ఉదయం 8.30కి బయలుదేరి మూడో రోజైన గురువారం ఉదయం 9.55 గంటలకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, నంద్యాల, మార్కాపూర్ రోడ్, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కొత్తవలస, విజయనదరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కెయోంజహార్ రోడ్, భద్రక్, ఖరగ్‌పూర్, అందుల్, డాన్కుని, బర్ధమాన్, బోల్పూర్ (శాంతినికేతన్), రాంపూర్ హట్, న్యూ ఫరక్కా, మాల్డా టౌన్, కిష్ణాగంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రణకు యశ్వంతపూర్–సహార్స మధ్య వయా గుత్తి మూడు ట్రిప్పుల ప్రత్యక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సహార్స– యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం. 05551)ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకూ గురువారాల్లో రాత్రి 10.25 గంటలకు సహార్సలో బయలుదేరి రెండు రోజుల తర్వాత శనివారం రాత్రి 10.30కి యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 05552) ఈ నెల 19 నుంచి మే 3వ తేదీ వరకూ ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి రెండు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 11 గంటలకు సహార్సకు చేరుతుందన్నారు. ఈ రైలు సిమ్రి భక్తియార్పూర్, మన్సి, ఖగారియా, బెగుసరాయ్, న్యూ బరౌని, కియుల్, ఝాఝా, జసిది, మధుపూర్, చిత్తరంజన్, అశన్‌సోల్, దుర్గాపూర్,బర్ధామన్, డంకుని, ఖరగ్‌పూర్, బేలేశ్వర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, విజయనగరం, విశాఖపట్టణం, దువ్వాడ, విజయవాడ, గుత్తి, ధర్మవరం, హిందూపురం, యల్హంక స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యాక్షన్ ప్లాన్ అమలు



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఏప్రిల్:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హుజురాబాద్‌లో బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు, సబ్ ఇన్స్పెక్టర్ యూనిస్ నాయకత్వం వహించారు.
ఈ సందర్భంగా అధికారులు ప్రమాదాలు తరచుగా జరుగుతున్న ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ముఖ్యంగా రోడ్డు భద్రతను పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.
**అధికారులు వెల్లడించిన ముఖ్య అంశాలు:**
ప్రమాదకర ప్రదేశాల్లో స్పష్టమైన సైన్ బోర్డుల ఏర్పాటు
అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం
రోడ్డు మార్కింగ్‌లను స్పష్టంగా చేయడం
వీధి దీపాల ఏర్పాటు ద్వారా లైటింగ్ మెరుగుదల
గుంతలను పూడ్చడం ద్వారా రహదారుల మరమ్మత్తులు
స్పీడ్ లిమిట్‌లను కఠినంగా అమలు చేయడం
అలాగే అతివేగం, అతిభారం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్దిష్ట గడువులోగా గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను పూర్తిగా సరిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, కానిస్టేబుల్ కత్తులు నాగరాజు, హోంగార్డు బుర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొమ్ము అశోక్‌కు బీజేపీ ఘన సన్మానం

## పట్టణ ఉపాధ్యక్ష పదవితో బాధ్యతలు మరింత పెరిగినట్లు నేతల అభిప్రాయం



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్:17**
జమ్మికుంట పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్ము అశోక్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు పాల్గొని అశోక్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ, కొమ్ము అశోక్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యమ సమయంలో విద్యార్థులను సమీకరించి అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉద్యమానికి బలమైన దిశను చూపించారని గుర్తుచేశారు. అశోక్‌లో ఉన్న నాయకత్వ లక్షణాలు, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసే నైపుణ్యం కారణంగా ఆయనకు ఈ పదవి రావడం సముచితమని పేర్కొన్నారు.
పట్టణ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అశోక్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చేలా కృషి చేయాలని సూచించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా పోరాటం చేయాలని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని పిలుపునిచ్చారు.
కొమ్ము అశోక్ కూడా ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ జమ్మికుంట పట్టణంలో బీజేపీని మరింత బలపరుస్తానని హామీ ఇచ్చారు.
ఈ సన్మాన కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, మోడెం రాజు, పోడేటి అనిల్, బూర్గుపల్లి రాము, రామిడి శ్రీకాంత్ రెడ్డి, మహ్మద్ అంజద్, చల్లూరి ప్రభాకర్, జిల్లెల్ల రాజశేఖర్ రెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాయత్రి నిర్భయ పథకం ద్వారా రూ.1 లక్ష చెక్ అందజేత

## - మృతుడి కుటుంబానికి అండగా గాయత్రి బ్యాంకు

**గాయత్రి నిర్భయ పథకం ద్వారా రూ.1 లక్ష చెక్ అందజేత -- మృతుడి కుటుంబానికి అండగా గాయత్రి బ్యాంకు**



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్:17**
జమ్మికుంటలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖలో నిర్వహించిన కార్యక్రమంలో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా కింద ప్రమాద భీమా సౌకర్యం ద్వారా మృతుడి కుటుంబానికి రూ. 1 లక్ష డెత్ క్లెయిమ్ చెక్కును అందజేశారు. ఈ చెక్కును మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నామినీ నాగపురి విజయకు అందజేశారు. గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన నాగపురి వెంకటస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాకు అనుబంధంగా ఉన్న ప్రమాద భీమా పథకం ద్వారా ఈ ఆర్థిక సహాయం అందించబడింది. ఈ సహాయం మృతుడి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, గాయత్రి బ్యాంకు మధ్య తరగతి వ్యాపారులు, ఉద్యోగ వర్గాల వారికి సులభ రుణ సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. అలాగే నామమాత్రపు చార్జీలతో అందిస్తున్న ప్రమాద భీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడం ప్రశంసనీయమని అన్నారు. అదేవిధంగా బ్యాంకు 24 గంటలు (ఎటిఎం )సేవలను అందుబాటులో ఉంచడం ద్వారా జమ్మికుంట మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఒడ్డుల మహేందర్, కౌన్సిలర్లు పోనగంటి రాము, కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, చుంచు శివ, కందాల రాము తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి నిర్భయ పథకం ద్వారా రూ.1 లక్ష చెక్ అందజేత

## -- మృతుడి కుటుంబానికి అండగా గాయత్రి బ్యాంకు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్:17**
జమ్మికుంటలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖలో నిర్వహించిన కార్యక్రమంలో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా కింద ప్రమాద భీమా సౌకర్యం ద్వారా మృతుడి కుటుంబానికి రూ. 1 లక్ష డెత్ క్లెయిమ్ చెక్కును అందజేశారు. ఈ చెక్కును మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నామినీ నాగపురి విజయకు అందజేశారు.
గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన నాగపురి వెంకటస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాకు అనుబంధంగా ఉన్న ప్రమాద భీమా పథకం ద్వారా ఈ ఆర్థిక సహాయం అందించబడింది. ఈ సహాయం మృతుడి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, గాయత్రి బ్యాంకు మధ్య తరగతి వ్యాపారులు, ఉద్యోగ వర్గాల వారికి సులభ రుణ సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. అలాగే నామమాత్రపు చార్జీలతో అందిస్తున్న ప్రమాద భీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడం ప్రశంసనీయమని అన్నారు.
అదేవిధంగా బ్యాంకు 24 గంటలు (ఎటిఎం )సేవలను అందుబాటులో ఉంచడం ద్వారా జమ్మికుంట మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఒడ్డుల మహేందర్, కౌన్సిలర్లు పోనగంటి రాము, కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, చుంచు శివ, కందాల రాము తదితరులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలు అర్థరాహిత్యం

- నిత్యం ప్రజల మధ్యలో ఉండే నాయకుడు ఆది శ్రీనివాస్
- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పై గురువారం చెన్నూరు మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు అర్థరాహిత్యమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విమర్శించారు. శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు ఆది శ్రీనివాస్ అని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ హయాంలో వేములవాడ అభివృద్ధి జరగలేదని, ఆది శ్రీనివాస్ ఎన్నికైన తరువాత సుమారు రూ. 700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి రూ. 150 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ. 46 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదే విధంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని, మూడో బ్రిడ్జి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, మల్కపేట రిజర్వాయర్, గుడి చెరువు వంటి పనులు పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం వాటిని వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, తోట రాజు, కొక్కుల బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సిరిగిరి శ్రీకాంత్, రజాక్, అరుణ్ తేజ చారి,దూలం భూమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.